## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ఐబీపీ పెట్రోల్‌బంక్ వద్ద గురువారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఒకరిని చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా మరోకరు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరకాలకు చెందిన శనిగరం కల్యాణ్ ద్విచక్రవాహనంపై హుస్నాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తుండగా, భీమదేవరపల్లి మండలం మంగళంపల్లికి చెందిన పెరుమాండ్ల ఆంజనేయులు హనుమకొండ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ముల్కనూరులోని ఐబీపీ పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.

**మాణిక్యాపూర్‌లో..**

భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనం సైకిల్‌ను ఢీ కొట్టగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు మాణిక్యాపూర్‌కు చెందిన కొమిరె సంపత్, కేతిరి మల్లారెడ్డి అని సమాచారం. వీరిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

### తండ్రి మందలించాడని యువకుడి ఆత్మహత్య


పూర్ణచందర్(ఫైల్)

ఐనవోలు: తండ్రి మందలించాడని ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ పంథిని గ్రామానికి చెందిన కుక్కల పూర్ణచందర్(25) మృతి చెందాడు. పూర్ణచందర్ ఆటో ట్రాలీ నడుపుతూ.. జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ట్రాలీ ఆటో సైతం దెబ్బతింది. అప్పటి నుంచి ఆయన ఇంటి వద్దే ఉంటున్నాడు. ట్రాలీ ఆటోకు మరమ్మతులు చేయించాలని 20 రోజులుగా పూర్ణచందర్ తన తండ్రిని ఒత్తిడి చేస్తున్నాడు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత రిపేర్ చేయిస్తానని చెప్పినా వినలేదు. ఈనెల 16న ఆదివారం రాత్రి 8గంటల సమయంలో పూర్ణచందర్ తండ్రితో గొడవపడ్డాడు. తండ్రి మందలించాడని తీవ్ర మనస్తాపానికి గురై రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మర్నాడు ఉదయం ఎలుకల మందు తాగినట్లు కాజీపేట నుంచి తండ్రికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పూర్ణచందర్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హనుమకొండ నుంచి ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి తీసుకెళ్లేవరకు (రాత్రి 7.30 గంటలు) పూర్ణచందర్ మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం పంథినిలో గురువారం అంత్యక్రియలు జరిగాయి. కుమారుడి మృతి ఘటనలో ఎవరిపైనా తమకు అనుమానం లేదని.. తండ్రి కుక్కల సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



● సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి

పరకాల : చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని కామారెడ్డిపల్లి మహిళ సంఘం సమాఖ్య కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు తదితర వేధింపుల్లో రక్షణ పొందడానికి సఖి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ నంబర్ 1098కు కాల్ చేయాలని సూచించారు. తద్వారా తక్షణ సహాయ రక్షణ లభిస్తుందన్నారు. అదే విధంగా 08702452112 లేదా 738283088 నంబర్‌లకు కాల్‌చేసి సఖి సేవలను పొందాలని అన్నారు. సఖి కేస్ వర్కర్ భారతి, రోజారాణి, మమత. కల్యాణి, లలిత, ఎస్‌హెచ్‌జీ మెంబర్స్ పాల్గొన్నారు.

### 'అంగన్‌వాడీ'లో అన్నప్రాసన

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్ర శివారులోని ఈర్యతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అంగన్‌వాడీ టీచర్ సరోజన గురువారం అన్నప్రాసన చేయించారు. అనంతరం సరోజన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో లభిస్తున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పవనకుమారి పాల్గొన్నారు.

# బీర సాగు భళా..


పందిరి ద్వారా సాగు చేస్తున్న కూరగాయలు


పందిరి సాగుతో ఏపుగా పెరిగిన బీరకాయలు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం
- ప్రభుత్వ సబ్సిడీతో పందిరి ఏర్పాటు
- బీరకాయలకు మార్కెట్‌లో భారీ డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రిటైర్డ్ ఉద్యోగి రవీందర్‌రెడ్డి


బీరకాయలను చూపుతున్న కుటుంబ సభ్యుడు

వేలేరు : మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కూరగాయల పంటలు సాగుచేస్తూ లాభాల బాటలో పయనిస్తున్నాడు మండల కేంద్రానికి చెందిన రైతు వెన్నవరం రవీందర్‌రెడ్డి. రెండెకరాల్లో గతంలో పత్తి, మొక్కజొన్న తదితర పంటలను సాగుచేసినా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో కూరగాయల సాగుపై దృష్టిసారించారు. దీంతో పదిహేనేళ్లుగా రెండెకరాల్లో బీర, కాకర, దొండ లాంటి తీగజాతి కూరగాయలను సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతూ ఈ ప్రాంత రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే మిగతా వ్యవసాయ భూమిలో వరితో పాటు ఇతర పంటలను సాగుచేస్తున్నారు. కాగా రవీందర్‌రెడ్డి ములుకనూరు కో ఆపరేటివ్ సీడ్స్ డివిజన్ అధికారిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన ఉద్యోగం చేస్తూనే వ్యవసాయంపై మక్కువతో కూరగాయల సాగు చేపట్టారు. కూరగాయల సాగులో ఎక్కువగా పందిరి సాగును ఎంచుకున్నారు. ప్రతీఏటా బీరకాయ, కాకరకాయ, దొండకాయ తోటలను సాగుచేస్తూ తీగజాతి పంటలపై పలువురు రైతుల దృష్టిని మళ్లిస్తున్నారు.

**మార్కెట్‌లో బీరకు డిమాండ్..**

హైబ్రీడ్ రకం బీర తోటను సాగుచేయడం ద్వారా బీరకాయలు ఏపుగా పెరిగి తాజాగా ఉండటంతో మార్కెట్‌లో ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. చుట్టుపక్కల గ్రామాల చిరువ్యాపారులు ఉదయం తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు రవాణా ఖర్చుల భారం కూడా తప్పుతుంది. తోట వద్ద బీరకాయలను రూ.50కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. చిరువ్యాపారులు కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లోని సంతలో విక్రయిస్తున్నారు. బీరకాయలను తోటలో ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి కూలీలు లేకుండా వారి కుటుంబ సభ్యులే తెంపుతూ మరింత ఆదాయం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం ప్రతీరోజు 100 కిలోల నుంచి 120 కిలోల వరకు దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు. ఒక ఎకరం బీరసాగులో 20 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుదని, వర్షాకాలంలో వాతావరణం చల్లగా ఉండటంతో దిగుబడి మరింత ఎక్కువగా వస్తుందని ఆయన చెప్పారు.

**సాగుకు అయిన ఖర్చు..**

గతంలో పందిరి సాగుకు ప్రభుత్వం ఒక ఎకరానికి మాత్రమే రూ.60వేలు సబ్సిడీ ద్వారా ఇచ్చింది. మిగతా ఎకరంలో రూ2.50 లక్షలతో స్వంతంగా పదిరిసాగు చేసినట్లు తెలిపారు. ఒకసారి ఏర్పాటు చేసిన పందిరి అనేక పంటలకు ఉపయోగపడుతుందని, అలాగే పందిరి సాగులో డ్రిప్పు, మల్చింగ్ కవర్‌లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. పంటలో కలుపురాకుండా మల్చింగ్ పద్ధతిని వినియోగించడం ద్వారా తోటలో ఎక్కువగా కలుపు వచ్చే అవకాశం లేదని, అలాగే డ్రిప్పు సిస్టం ద్వారా తక్కువ నీటితో ఈ పంటలను సాగుచేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు వేసేముందు బెడ్లు తయారు చేసేందుకు రూ.22 వేల ఖర్చుతో బెడ్ మేకర్‌ను కొనుగోలు చేశానని, అప్పటి నుంచి క్రమం తప్పకుండా తీగజాతి కూరగాయలను సాగుచేస్తున్నట్లు తెలిపారు. రెండు ఎకరాల్లో బీర విత్తనాలకు రూ.25వేలు, మల్చింగ్ కవర్‌లకు రూ.15 వేలు, కూలీలకు, ఇతరాత్ర ఖర్చులకు రూ.10వేలు, ఎరువులు, పురుగు మందులకు 10వేలు మొత్తం పెట్టుబడి ఎకరానికి రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఎకరానికి ఖర్చు అవుతుందని తెలిపారు. విత్తనాలు నాటిన 45 రోజులు తర్వాత పంట కోతకు వస్తుందని, అన్ని ఖర్చులు మినహా ఎకరానికి రూ.1.40 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. మండలంలోని రైతులు కూరగాయలు సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో లాభాలు పొందవచ్చని తెలిపారు.

**15 ఏళ్లుగా పందిరి సాగు**



15 ఏళ్లుగా 2 ఎకరాల్లో బీర, కాకర, దొండ, సోరకాయ వంటి తీగజాతి కూరగాయలను సాగు చేస్తున్నాను. పందిరిసాగు ద్వారా మంచి దిగుబడులు వస్తున్నాయి. ఈ పద్ధతి సాగుతో మొక్కలు ఏపుగా పెరిగి తీగలు పందిరిపై అల్లుకుని బీరకాయలు కిందికి వేలాడుతూ చెడిపోకుండా ఉంటాయి. పంట కోసేందుకు కూడా ఇబ్బంది ఉండదు. చిన్న, సన్నకారు రైతులు కూరగాయల సాగుతో ఆర్థికంగా బలపడవచ్చు. కూరగాయలు సాగుచేయడమే కాకుండా వాటిని ఎలా మార్కెంగ్ చేసుకోవాలో రైతు అవగాహన కలిగిఉండాలి.

– వెన్నవరం రవీందర్ రెడ్డి, రైతు

## వ్యవసాయ రంగంపై ప్రభుత్వాల చిన్నచూపు


మాట్లాడుతున్న రాములు

వేలేరు : వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీని రైతులందరికీ వర్తింపచేయలేదని మండిపడ్డారు. ధరణి పోర్టల్‌తో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే నల్ల చట్టాలను రద్దు చేయాలని, లేనిపక్షంలో రైతుసంఘం ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**మండల కమిటీ ఎన్నిక**

వేలేరు మండల రైతుసంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చొప్పరి సురేశ్, మండల ప్రధాన కార్యదర్శిగా లడే తిరుపతి, సహాయ కార్యదర్శిగా గుండు రాజు, కార్యవర్గ సభ్యులుగా జెట్టి తిరుపతి, ఇట్టబోయిన సాంబయ్య, వీరయ్య, రమేశ్‌ను ఎన్నకున్నారు. సీపీఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేశిని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యా అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు. అంతకుముందు 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ భిక్షపతి హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### భయం లేకుండా పరీక్షలు రాయాలి

శాయంపేట : పదో తరగతి విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని మండలంలోని పత్తిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి అన్నారు. గురువారం పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంక్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

## ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ చూపాలి


విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పుష్పలీల

ఆత్మకూరు : విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ పుష్పలీల అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో గల పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ సిద్ధార్థనాయక్, ప్రిన్సిపాల్ అనిత, వైద్య సిబ్బంది సంపత్, అశ్మ, ఎల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు. అంతకుముందు గురుకుల పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ (నోడల్ అధికారి) సిద్ధార్థ నాయక్ తనిఖీ చేశారు. పాఠశాలలో భోజన తయారీ విధానం, భోజనాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## స్వీయ నియంత్రణతోనే జీవితంలో ఉన్నతి

నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ

ఖానాపురం : స్వీయ నియంత్రణతోనే జీవితంలో ఉన్నతి సాధించగలమని నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ స్పష్టం చేశారు. మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్ గురువారం నిర్వహించిన 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర అవసరం పరికరాలకు దూరంగా ఉండాలని సూచించారు. అవసరమున్న సందర్భాల్లోనే ఫోన్ మాట్లాడాలని చెప్పారు. అవసరం లేని దేనికోసం కూడా సమయాన్ని వృథా చేయొద్దని తెలిపారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని కోరారు. ఆరోగ్యానికి, భవిష్యత్తుకు నష్టం కలిగించే వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రణాళికాయుతంగా చదువుకోవాలన్నారు.

## ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శాయంపేట : అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించడం హర్షణీయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టి అసెంబ్లీలో ఆమోదించారని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆమోదానికి కృషిచేశారని తెలిపారు. బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం వారికి 42 శాతం రిజర్వేషన్లు పెంచి చట్టబద్ధత కల్పించిన అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోశించారన్నారు. బీసీలకు సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, బిల్లుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

### ఎంపీ 'ఈటల' జన్మదినం


పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కమలాపూర్ : బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ, ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కమలాపూర్‌లోని ఈటల నివాసంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, నాయకులు శోభన్, అరవింద్, అశోక్‌రెడ్డి, కోటేశ్వర్, సాంబరావు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణపై అవగాహన



శాయంపేట : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయికృష్ణ క్షయ వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ.. క్షయవ్యాధిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యాధి ఎలా వ్యాపిస్తుందో వివరించి, లక్షణాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, సూపర్‌వైజర్ మల్లేశం, టీబీ నోడల్ పర్సన్ చలపతి, ఎస్‌టీఎల్‌ఎస్ జనార్దన్, ఎస్‌టీఎస్ శ్రీనివాస్, ఎస్ఎన్ సరిత పాల్గొన్నారు.

## 'కడియం' కాలుపెడితే భస్మమే

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్ : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎక్కడ కాలు పెట్టినా భస్మమేనని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రోటోకాల్ పాటించకుండా మంత్రులను బ్లాక్‌మెయిల్ చేసి ఆఘమేఘాల మీద వారిని హెలీకాప్టర్‌లో తీసుకొచ్చి దేవన్నపేట పంపుహౌస్‌లో మోటార్లు ఆన్‌చేస్తే అవి మొరాయించడం హాస్యాస్పదం అన్నారు. రైతులు సాగు నీటి కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 43 కిలోమీటర్లు దేవాదుల టన్నెల్ వర్క్ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే పూర్తి చేశామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చింది.. కరువు తాండవిస్తుందని, కాంగ్రెస్ ఏది ముట్టుకున్న అక్కడ నష్టాలే జరుగుతున్నాయని విమర్శించారు. కడియం శ్రీహరి ఎక్కడ కాలు పెడితే అక్కడ భస్మమేనని విమర్శించారు. ధర్మసాగర్‌కు టెక్స్‌టైల్ పార్కు మంజూరై 146 ఎకరాలు ల్యాండ్ అక్విజేషన్ చేసి రైతులకు డబ్బులు చెల్లించిన తర్వాత ఉప ముఖ్యమంత్రిగా వచ్చి అక్కడ కాలుపెడితే అది మరో చోటకు మార్చబడిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ సోమిరెడ్డి, నాయకులు రవీందర్, భూపతిరాజు, ప్రతాప్, జోజి, మహేందర్, శ్రీనివాస్, మధుకర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల కేడర్‌లో వర్గపోరు..?

● నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు


శంకుస్థాపన చేసి అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు

వేలేరు : మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త, పాత క్యాడర్ మధ్య ఆధిపత్య పోరు తీవ్ర స్థాయిలో ఉందనే చర్చలు జరుగుతున్నాయి. ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా చేరిన నాయకులకే ప్రాధాన్యత దక్కుతుందని మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంట కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన నాయకుల పెత్తనం సహించలేక కొంతమంది నాయకులు కొన్ని రోజుల కిత్రం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు సమాచారం. కొన్ని నెలల క్రితం కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాంధీ భవన్‌కు వెళ్లి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అతడి వెంట వచ్చిన వారికే ప్రాధాన్యమిస్తూ పార్టీ కార్యక్రమాల్లో తమకు సమాచారం కూడా ఇవ్వడం లేదని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

**వర్గపోరుతో నిలిచిన సీసీ రోడ్డు నిర్మాణం**

పది రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే మరో వర్గానికి చెందిన నాయకులు రోడ్డు నిర్మాణ పనులు తామే చేస్తామనడంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి ఆ పంచాయితీ కాస్త పోలీస్ స్టేషన్ వరకు చేరింది. అప్పటి నుంచి సంబంధిత సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఎవరు కూడా చేపట్టడంలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరికొన్ని రోజుల్లో ముగుస్తుండటంతో రోడ్డు నిర్మాణానికి వచ్చిన నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ చూపి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## బీమా పథకాలను వినియోగించుకోవాలి

● టీజీబీ రీజనల్ మేనేజర్ బాలనాగు


కల్యాణికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న ఆర్ఎం బాలనాగు

కమలాపూర్ : దురదృష్టవశాత్తు కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి బీమా పథకాలు ఆసరాగా నిలుస్తాయని, ప్రతిఒక్కరూ బీమా పథకా లను వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ బి.బాలనాగు సూచించారు. మండలంలోని కన్నూరుకు చెందిన నాగపురి మధుకుమార్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉప్పల్ శాఖలో రూ.వెయ్యి చెల్లించి రూ.20 లక్షల ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ పొంది ఉండగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మధుకుమార్ మృతిచెందాడు. ఆయనకు మంజూరైన రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన భార్య కల్యాణికి గురువారం బ్యాంకు రీజనల్ మేనేజర్ బాలనాగు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంబీ సాయికృష్ణ, ఎస్ఎంఓ సుబ్బారావు, బ్రాంచ్ మేనేజర్ డేవిడ్, బీమా అధికారులు సమీర్, కుమార్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం


మాట్లాడుతున్న పురుషోత్తం

వేలేరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.పురుషోత్తం అన్నారు. అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పీఎంశ్రీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సోసైటీ జాయింట్ సెక్రటరీ పిట్టల రవిబాబు మాట్లాడుతూ.. రేడియేషన్ ప్రభావంతో పిచ్చుకలు ప్రమాదంలోకి నెట్టబడుతున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం పక్షులను కాపాడుకోవాలని అన్నారు. వేసవికాలంలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు ధాన్యపు గింజలు, తాగునీటి అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణంపై, జంతువుల సంరక్షణపై బాధ్యత కలిగి ఉండాలని అన్నారు. ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్, రవి, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీ బారిన పడకుండా అవగాహన కల్పించాలి

● డాక్టర్ పంతం సునీత


మాట్లాడుతున్న డాక్టర్ సునీత

కమలాపూర్ : హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రజలందరికీ అవగాహన కల్పించాలని టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్, సంపూర్ణ సురక్ష కేంద్రం అధికారి డాక్టర్ పంతం సునీత సూచించారు. కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమలాపూర్, ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల వైద్య సిబ్బందికి గురువారం అడ్వకేసి, సెన్సిటైజేషన్ సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లాలో తాము చేస్తున్న కార్యక్రమాలకు ఏఏఎం సిబ్బంది సహకరించాలన్నారు. అనంతరం సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ ఇక్బాల్‌పాషా మాట్లాడుతూ.. హెపటైటిస్–బీ, సిఫిలిస్, టీబీ గురించి వివరించి హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌యాక్ట్–2017పై అవగాహన కల్పించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో హెచ్‌ఐవీ స్క్రీనింగ్ పెంచాలని, హైరిస్క్ క్లెంట్లను గుర్తించి వెంటనే వారిని సంపూర్ణ సురక్ష కేంద్రంలో నమోదు చేయించాలన్నారు. టీబీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుఖ లైంగిక వ్యాధులకు సంబంధించిన కేసులన్నింటిని సంపూర్ణ సురక్ష కేంద్రానికి పంపించాలన్నారు. విద్యార్థులకు హెచ్‌ఐవీపై నిర్మూలనపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రమదేవి మహిళా మండలి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్, వైద్యులు అరుణ్‌కుమార్, రోహిత్, హెచ్ఈఓ రవీందర్, ఎంపీహెచ్ఎస్ వెంకటరమణారెడ్డి, హెడ్ నర్స్ జ్యోతి, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, ఐసీటీసీ కౌన్సిలర్ సురేశ్, సంపూర్ణ సురక్ష కేంద్రం ఔట్‌రీచ్ వర్కర్స్ సరిత, రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.